క్లుప్తంగా

రక్తం చిందించి కర్బలా అమరవీరులకు నివాళి



పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెంలోని రెండు మసీదుల్లో ముస్లింలు రక్తం చిందించి కర్బలా అమరవీరులకు నివాళి అర్పించారు. ధర్మం కోసం చేసిన యుద్ధంలో అసువులు బాసిన కర్బలా అమరవీరులకు చాహేలూమ్(40వరోజు) సందర్భంగా గ్రామంలో పీర్లను ఊరేగించారు. విషాద గీతాలతో శ్రద్ధాంజలి ఘటించారు. మాతం నిర్వహించి రక్తతర్పణ చేశారు. గదీర్ సొసైటీలో మతగరువు మౌలానా షమీముల్ హసన్ నజఫి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చెర్మన్ షా జవాద్ అలీ, అధ్యక్షుడు సాజిద్ అలీ, కార్యదర్శి హుస్సేన్ అలీ పాల్గొన్నారు.

డాక్టర్ లక్ష్మణరావుకు ఫార్మా అవార్డు



గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణ రావుకు ఎంఎల్(మహదేవ్ లాల్) ఫార్మా రికగ్నిజేషన్ అవార్డు వరించింది. ఈ విషయాన్ని గురువారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. ఫార్మసీ రంగంలో సేవలను పురస్కరించుకుని ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఢిల్లీ ఫార్మలోక్ అసోసియేషన్ వారు ఈ అవార్డును అందించారని చెప్పారు. ఈ సందర్భంగా లక్ష్మణరావును పలువురు అభినందించారు.

చెరువులా మారిన తాడంకి అండర్‌పాస్



పమిడిముక్కల: విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారిపై తాడంకి–గోపువానిపాలెం మధ్య ఫ్లై ఓవర్ కింద ఉన్న అండర్ పాస్ ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెరువులా మారింది. వర్షం నీరు పోయే మార్గం లేకపోవడంతో రోజుల తరబడి నీరు నిలిచి ఉంటోంది. జాతీయ రహదారి కావడంతో వాహన రాకపోకల తాకిడి ఎక్కువగా ఉంది. అండర్ పాస్ లోనుంచి బయటకు వెళ్లేందుకు వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నీటిలో నుంచి వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ ప్రాంతాన్ని మెరక చేసి నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చిత్రలేఖన పోటీల్లో విద్యాలయ విద్యార్థి ప్రతిభ

గుడివాడరూరల్: ఎల్ఐసీ జీవిత బీమా వారోత్సవాల్లో భాగంగా గుడివాడ పట్టణ స్థాయిలో నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో తమ పాఠశాల విద్యార్థి మూడెడ్ల పూర్ణ శ్రీపునీత్ అత్యంత ప్రతిభ కనబర్చి ద్వితీయ బహుమతి సాధించడం అభినందనీయమని విద్యాలయ సంస్థ డైరెక్టర్ బొప్పన విజయభాస్కర్ అన్నారు. గురువారం పాఠశాలలో విద్యార్థిని అభినందించారు. పాఠశాల డైరెక్టర్ బొప్పన శాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ ప్రజలందరూ సమానత్వంతో జీవించాలి

గుడివాడరూరల్: దేశంలో ఉన్న ప్రజలందరూ కుల, మతాలకు అతీతంగా భిన్నత్వంలో ఏకత్వంగా కలసిమెలసి జీవించాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు అన్నారు. గుడివాడ పట్టణంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాభూమి–నాదేశం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ నెల 18వ తేదీన నరేంద్రమోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దేశవ్యాప్తంగా తలపెట్టిన నాభూమి–నాదేశం కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో మట్టిని సేకరించే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం బీజేపీ లో చేరిన మాజీ సైనిక ఉద్యోగి నరసింహారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామినేని వెంకటకృష్ణ, జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీరాజబాబు, జిల్లా ఇన్‌చార్జి కపర్థి పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

మండవల్లి: మండలంలోని పెరికెగూడెం సంఘంలో పాల ఉత్పత్తిదారులకు కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు గురువారం 2022–2023వ సంవత్సరానికి బోనస్‌ను రూ.2 లక్షల 18 వేల 160 పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుడ్లవల్లేరు పాల శీతలీకరణ కేంద్రం మేనేజర్ తోట సత్యనారాయణ, సంఘం అధ్యక్షుడు పిండి రాధాకృష్ణారెడ్డి, సూపర్‌వైజర్ గోరింట్ల గోపిరాజు, వేతన కార్యదర్శి శ్రీనివాసరావు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని గన్నవరం సొసైటీని ఆంజనేయులు సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పాల్గొన్న ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: మండలంలోని ఐనపూరులో శ్రీ వేణుగోపాలకృష్ణ మందిరం ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెనమలూరు, పామర్రు ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్ ఐనపూరు వెళ్లి వేణుగోపాలకృష్ణ మందిరంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మందిర కమిటీ తరఫున ఎమ్మెల్యేలు సారథి, అనిల్‌కుమార్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండా జయలక్ష్మి, ఎంపీటీసీ వీర్ల ఆదిశేషు, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, తమ్మా అప్పిరెడ్డి, కొండా బసివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

పామర్రు: స్థానిక విష్ణాలయంలోని వేణుగోపాలస్వామికి తెల్లవారుజాము నుంచి విశేషంగా పంచామృతాభిషేకాలు, నవరసాలతో, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేకంగా స్నపన కార్యక్రమాలను చేశారు. అనంతరం స్వామికి వెన్నపూసను నివేదించారు. తులసీ దళాలతో, పలు రకాల పుష్పమాలలతో స్వామిని శత సహస్ర నామాలతో ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆలయంలో పూజాకార్యక్రమాలను ఆలయ అర్చకులు రొంపిచర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ మేనేజర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని పెదమద్దాలి, జమీగొల్వేపల్లి, జురుపవరం, నిమ్మకూరు, పెరిశేపల్లి, కనుమూరు, కురుమద్దాలి తదితర గ్రామాల్లోని వైష్ణవ వైఖానస ఆలయాలలో కృష్ణభగవానునికి విశేషంగా పూజలు చేశారు.

అరవింద స్కూల్‌లో కృష్ణాష్టమి సంబరాలు

అడ్డాడ(పామర్రు): మండలంలోని అడ్డాడ గ్రామంలో అరవింద హైస్కూల్‌లో గురువారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత బాలబాలికలు కృష్ణుడు, రాధ వేషాల్లో అలంకరించుకుని అలరించారు. ప్రిన్సిపాల్ రమణ మూర్తి చిన్నారులతో కృష్ణుని చిత్రపటానికి పూజలను చేయించారు. అనంతరం విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా నిర్వహించారు.

వడాలిలో కృష్ణాష్టమి వేడుకలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. గురజ వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. వైవాక, చిగురుకోట శివారు గంగాపురం గ్రామాల్లో యాదవ యూత్ ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహాలతో ఊరేగింపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరిపైఒకరు గులాములు, రంగులు చల్లుకుంటూ సందడి చేశారు.



ఐనపూరులో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకొంటున్న ఎమ్మెల్యేలు కొలుసు పార్థసారథి, కైలే అనిల్‌కుమార్



అడ్డాడ అరవింద స్కూలులో రాధాకృష్ణుల వేషంలో ఉట్టి కొడుతున్న బాలబాలికలు

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

మండవల్లి: మండలంలోని అల్లినగరం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయం వద్ద శ్రీ కృష్ణాష్టమిని పురస్కరించుకుని స్వామివారికి గురువారం విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది. దేవదాయ ధర్మదాయ శాఖ పర్యవేక్షణలో ఆలయ అర్చకులు సుదర్శనం గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తుల సహకారంతో పూజలు జరిగాయి.

మండవల్లిలో గంగానమ్మ జాతర

మండవల్లిలో గంగానమ్మ జాతర ఘనంగా గురువారం నిర్వహించారు. శ్రీ కృష్ణాష్టమి అనంతరం ప్రతి ఏటా రెండో రోజు గంగానమ్మ జాతర నిర్వహించడం యాదవ కులస్తులకు ఆనవాయితీగా వస్తోంది. చేబోయిన వీర్రాజు, బొమ్మనబోయిన గోకర్ణయాదవ్, చేబోయిన శ్రీను, ఆగొల్లు గంగారావు, ఆగొల్లు వెంకన్న, చేబోయిన రామకృష్ణ, ఎస్.రమేష్, ఎస్.కృష్ణారావు, చెన్ను పండు, జాజుల రాము పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి

మొవ్వ: మొవ్వ మండలంలో గురువారం శ్రీ కృష్ణాష్టమి వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కూచిపూడిలోని వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. యువతతో పాటు ఓ చిన్నారి బాలుడు బుల్లి కృష్ణుడి వేషధారణలో ఉట్టి కొట్టి ఆకట్టుకున్నాడు. ఈ వేడుకలను మొవ్వ, భట్ల పెనుమర్రు,చినముత్తేవి,పెడసనగల్లు,కారకంపాడు,అయ్యంకి, కోసూరు, అవురుపూడి గ్రామాల్లో నిర్వహించారు.

తోట్లవల్లూరులో కృష్ణాష్టమి వేడుకలు

తోట్లవల్లూరు: తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకుడు విజయకుమార్ ఆచార్యులు వేణుగోపాల స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు జరిపి వెన్నతో అలంకరించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి హరిగుప్తా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వేణుగోపాలునికి ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు: శ్రీ కృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గుడ్లవల్లేరు శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామివారి ఆలయంలో స్వామివారికి గురువారం అర్చకుడు అగ్నిహోత్రం ఫణిగోపాల్ ప్రత్యేక పూజలను నిర్వహించారు. తొలుత స్వామివారికి విశేషాభిషేకాలను చేశారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



తోట్లవల్లూరులో వేణుగోపాలస్వామికి పూజలు



గురజ వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు



పామర్రులో సర్వాంగ సుందరంగా అలంకరించిన వేణుగోపాలస్వామి

అల్లినగరంలో ఉట్టి కొట్టే వేడుక

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో కొలువై ఉన్న శ్రీ రుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో గురువారం సాయంత్రం యువకులు ఉట్టి కొట్టే కార్యక్రమం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. మండవల్లి నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో శ్రీ విజయదుర్గ అమ్మవారికి గాజుల అలంకరణ ఆలయ అర్చకులు చాగంటి శ్రీనివాస్ నిర్వహించారు.

కైకలూరులో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



మీసాల వెంకన్న దేవాలయంలో శ్రీకృష్ణ విగ్రహం వద్ద డీఎన్నార్ పూజలు



తాడినాడ రామాలయంలో కృష్ణాష్టమి వేడుకలో భక్తులు

కైకలూరు: భగవాన్ శ్రీకృష్ణుని ఆశీస్సులు నియోజకవర్గ ప్రజలందరికీ దక్కాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అన్నారు. శ్రీ కృష్ణాష్టమి వేడుకలు యాదవ సంఘం ఆధ్వర్యంలో గురువారం కైకలూరు మీసాల వెంకన్న దేవాలయంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు స్వామివారికి ప్రత్యేక పూజల చేశారు. ఈ సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో వీరిని ఘనంగా సన్మానించారు. మీసాల వెంకన్న దేవాలయ చైర్మన్ బొప్పన శివకుమార్, ఆలయ ఈవో వీఎన్‌కే శేఖర్, ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ సేవాదళ్ అధ్యక్షుడు బలే నాగరాజు, నాయకులు చేబోయిన వీర్రాజు, బూరుబోయిన మోహనరావు, యాదవ సంఘ ప్రముఖులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి ఊరేగింపు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు జరిగాయి.

కలిదిండి మండలంలో...

తాడినాడ గ్రామంలో అపర భద్రాద్రిగా పేరుగాంచిన సీతారామస్వామి దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి వేడుక ఘనంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు హాజరయ్యారు. ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు. బీఎస్సార్ ఆక్వా ట్రేడర్స్ అధినేత బూరుబోయిన శ్రీనివాసరావు కలిదిండి, చావలిపాడు, వేమవరప్పాడు, వైవాక గ్రామాల్లో జరిగిన శ్రీకృష్ణాజన్మాష్టమి వేడుకల్లో పాల్గొన్నారు. కలిదిండిలో టీషర్టులను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కలిదిండి సర్పంచ్ మసిముక్కు మారుతీప్రసన్న, మాజీ జెడ్పీటీసీ నున్న రమాదేవి, గొరిపర్తి సుబ్బారావు, యాదవ ప్రముఖులు పాల్గొన్నారు.

దేవస్థానాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకచర్యలు

- ఎమ్మెల్యే కొడాలి నాని
- శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో రూ.30లక్షలతో నిర్మించిన కాలక్షేప మండపం ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని

గుడివాడరూరల్: రాష్ట్రంలో దేవస్థానాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మాజీమంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. పట్టణంలోని శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో రూ.30 లక్షలతో నిర్మించిన కాలక్షేప మండపాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. తొలుత స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబం నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని, నియోజకవర్గంలోని ప్రజలు పాడిపంటలతో సంతోషంగా జీవించాలని కోరుకున్నారు. అనంతరం నిర్వహించిన సభలో ఎమ్మెల్యే కొడాలి నాని మాట్లాడుతూ దేవాలయాల అభివృద్ధికి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పురాతన దేవాలయాల అభివృద్ధిలో భక్తులు కూడా భాగస్వాములు కావాలని కోరారు. రాష్ట్రంలో ప్రజలకు అవసరమైన ప్రతి మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు మండలి హనుమంతరావు, ఎంవీ నారాయణరెడ్డి, పాలేటి సుబ్రహ్మణ్యం (చంటి), దుడ్డు చిన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



కూడేరులో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తెలిపారు. మండలంలోని కూడేరు గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన బ్రోచర్లు అందజేశారు. గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతర్గత రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానన్నారు. కూడేరు అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విఠల్‌పాల్, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, సర్పంచ్ వీర్ల నాగరాజు, ఎంపీటీసీ వీర్ల ఆదిశేషు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, వైస్ ఎంపీపీ గంజాల సీతారామయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు తమ్మా అప్పిరెడ్డి, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, నియోజకవర్గ బూత్ కన్వీనర్ మారపాక మహేష్, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, కొణతం రాధా రమేష్ పాల్గొన్నారు.

పూర్వ ఉపాధ్యాయుడికి రూ.70 వేల ఆర్థిక సాయం



కైకలూరు(కలిదిండి): అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పూర్వ ఉపాధ్యాయుడికి గురువారం యాజమాన్యం, పూర్వ విద్యార్థులు కలసి రూ.70 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. కోరుకొల్లు క్రాంతి హైస్కూల్‌లో ఎస్వీ గోపాల్ (62) ఉపాధ్యాయుడిగా పనిచేసి అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ కరస్పాండెంట్ చెన్నంశెట్టి కృష్ణ, పూర్వ విద్యార్థులు కలసి ఈ సాయం అందించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

గుడివాడరూరల్: అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని గుడివాడ అగ్నిమాపక కేంద్ర అధికారి జె.ఆంజనేయులు అన్నారు. నందివాడ మండలంలోని తుమ్మలపల్లి, అనమనపూడి గ్రామాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన సదస్సును గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు అగ్ని ప్రమాద నివారణ యంత్రాలు అందుబాటులో లేని సమయంలో స్థానికంగా అందుబాటులో ఉన్న నీటితో పాటు ఇతర వస్తువులను ఏ విధంగా ఉపయోగించి ప్రమాదాలను నివారించాలనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించి పలు సూచనలు, సలహాలు అందించారు. అతి భారీ వర్షాలు, వరదల వలన కలిగే ప్రమాదాల సమయంలో నీటిలో ఉన్న కొబ్బరిమట్టలు, కొబ్బరికాయలు వంటి ఇతర వస్తువులను ఉపయోగించి నీటిలో మునగకుండా ప్రమాదాల నుంచి ఏ విధంగా బయట పడాలో తెలియజేశారు. కార్యక్రమంలో తుమ్మలపల్లి, అనమనపూడి సర్పంచ్‌లు సింగాల రాధాకృష్ణ, అడుసుమిల్లి సీతారావమ్మ, పంచాయతీ సిబ్బంది, ఫైర్‌మెన్ బి.శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి యూనిఫామ్ పంపిణీ

పామర్రు: అంగన్‌వాడీల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక రకాల చర్యలు తీసుకుంటోందని దీనిలో భాగంగా కేంద్రాలలో విధులు నిర్వహించే వారికి యూనిఫామ్‌ను ఉచితంగా అందజేస్తున్నట్లు పామర్రు ఐసీడీఎస్ సీడీపీవో వి.భానుశ్రీ తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కేంద్రాలలోని సిబ్బందికి యూనిఫామ్స్‌ను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ పామర్రు ప్రాజెక్టు పరిధిలోని పామర్రు, పెదపారుపూడి, గుడ్లవల్లేరు మండలాలలోని 205 మంది కార్యకర్తలకు, 192 మంది మిగిలిన సిబ్బందికి యూనిఫామ్స్ అందజేశామన్నారు. వీరికి గతంలో రెండు జతలు ఇచ్చామని, ప్రస్తుతం మరొక రెండు జతల యూనిఫామ్ అందజేస్తున్నామని చెప్పారు. కేంద్రాలలోని చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు పోషక విలువలు గల ఆహారాన్ని అందిస్తూ వారి ఆరోగ్య అభివృద్ధికి సిబ్బంది కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో పామర్రు, పెదమద్దాలి సెక్టార్ల సూపర్‌వైజర్లు అనిత, విజయకుమారి, అంగన్‌వాడీ నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



కైకలూరు: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు సూచించారు. బస్టాండ్ సమీపంలో హెల్మెట్లు ధరించని వాహనదారులకు గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కైకలూరు పట్టణ పరిధిలో ఇప్పటికే ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించామన్నారు. ప్రజలకు అవగాహన కోసం రహదారులకు పెయింటింగ్, రాత్రి సమయంలో వాహన డ్రైవర్లకు చల్లటి నీటితో ముఖం కడిగించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ప్రతాపరెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు



రోగులకు మందులను అందిస్తున్న సుధారెడ్డి

గుడ్లవల్లేరు: పేదలను ఆదుకోవటమే తమ ఎంఈఐఎల్, ఎస్ఆర్ ఫౌండేషన్ ముఖ్యోద్దేశమని భూ సమేత వేంకటేశ్వర దేవస్థాన వ్యవస్థాపకురాలు పురిటిపాటి సుధారెడ్డి అన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ(సి.ఎస్.ఆర్) కింద డోకిపర్రులో ఎంఈఐఎల్, ఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వైద్య శిబిరంలో 250 మంది రోగులకు వైద్య పరీక్షలను చేసి ఉచితంగా మందులు అందజేశారు.

13 నుంచి మండలస్థాయి క్రీడాజట్ల ఎంపిక

తోట్లవల్లూరు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 15 వరకు అండర్ 17, అండర్ 14 బాల, బాలికలకు సంబంధించి మండల స్థాయి క్రీడాజట్ల ఎంపిక నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి బి.సురేష్ తెలియజేశారు. ఈ విషయమై స్థానిక ఎంఆర్‌సీ భవనంలో ఎంఈఓ జి. వెంకటేశ్వరరావు అధ్యక్షతన వ్యాయామ ఉపాధ్యాయులు గురువారం సమావేశమై ఎంపిక తేదీలను ఖరారు చేశారు. 13న వల్లూరుపాలెం జెడ్పీ పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, 14న తోట్లవల్లూరు జెడ్పీ పాఠశాలలో వాలీబాల్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఈనెల 15వ తేదీన పెనమకూరు జెడ్పీ పాఠశాలలో అథ్లెటిక్స్, సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక జరుగుతుందన్నారు. అథ్లెటిక్స్ 14 సంవత్సరాలలోపు బాల, బాలికలకు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 600 మీటర్లు, లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, డిస్కస్ త్రో అంశాలలో ఎంపికలు జరుగుతాయని చెప్పారు. 17సంవత్సరాలలోపు బాల, బాలికలకు 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్లు, 1500 మీటర్లు, 3000 మీటర్లు పరుగు పందేలు, 3000 మీటర్ల వాకింగ్, షాట్‌పుట్, డిస్కస్‌త్రో, జావలిన్‌త్రో, లాంగ్‌జంప్, హైజంప్, ట్రిపుల్ జంప్ అంశాలలో జట్ల ఎంపిక జరుగుతుందని సురేష్ వివరించారు. 14 ఏళ్ల లోపు బాల, బాలికలు 2010 జనవరి ఒకటి తరువాత పుట్టిన వారు అర్హులని, 17 ఏళ్ల లోపు బాల, బాలికలు 2007 జనవరి 1 తరువాత పుట్టిన వారు అర్హులని పేర్కొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

తోట్లవల్లూరు: క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులకు ఎల్లప్పుడూ గుర్తింపు ఉంటుందని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకుని జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు సాధించిన ఉపాధ్యాయులకు మండల విద్యాశాఖ ఆధ్వర్యాన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా స్థాయిలో అవార్డులు సాధించిన ఎ.కోటేశ్వరరావు(కుమ్మమూరు), బి.హిమకుమారి(చాగంటిపాడు,ఎంపీయూపీఎస్), ఎస్‌బీడీ దుర్గామల్లేశ్వరి(గరికపర్రు ఎంపీయూపీఎస్)లను ఎంపీపీ రాజామణి, జెడ్పీటీసీ రామ్మోహన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుసుమకుమారి, ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, వైస్ ఎంపీపీ మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, కుమ్మమూరు సర్పంచ్ బొమ్మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓలు జి. వెంకటేశ్వరరావు, బి.సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.